


# మల్లెలు నవ్వాయి

కొండ సరోజారాణి

ఎప్పుడూ తను సాయంకాలం ఆఫీసు నుండి యింటికి వచ్చేసరికి గుమ్మంలో నిల్చుని, చిరునవ్వుతో తనను మురిపించే, తన అర్ధాంగి దేవిక, ఆ నాడు ఎదురవక పోవడంతో అసంతృప్తి చెందాడు సుందరం. మెల్లగా యింట్లోకి నడచి, భార్యకోసమై తెచ్చిన మల్లెపూలని టేబిల్ పై ఉంచాడు తను వచ్చాడనే సూచనగా కుర్చీలో శబ్దమయినట్టుగా కూర్చుని, బూట్లు విప్పాడు వంటగదివైపు ఓ కన్ను పోనిస్తూ.

భర్త వచ్చిన అలికిడి విని, కాఫీ కప్పుతో ప్రత్యక్షమయింది దేవిక.

అదోలా వున్న భార్య మొహం లోనికి గుచ్చి చూస్తూ "ఏం అలా వున్నావు దేవీ! ఒంట్లో బాగా లేదా?" అంటూ కప్పు అందుకుని టేబిల్ పై పెట్టాడు

ఆ ఆప్యాయతతో కూడిన పిలుపుకి పరవశించి, అలసట పేరుకున్న అతని మొహాన్ని తన చీర కొంగుతో ఒత్తాలని, చెదిరిన అతని క్రాఫ్‌ని సవరించి, అతని గుండెల్లో మొహం దాచుకోవాలని అనుకున్న దేవిక హృదయం, యిందాకటి పిన్నిగారి మాటలు జ్ఞప్తికి వచ్చి, బాధగా నిట్టూర్చింది భార్య మొహంలోనికి ప్రశాంతంగా చూస్తున్న సుందరం, ఆమె నుండి ఎంతకీ జవాబు రాక పోవడంతో లేచి, ఆమె భుజంపై ప్రేమగా చేయి వేసాడు

యింకోసారయితే ఆమె ఆ స్పర్శకి మైమరచి, పరవశించేది. కాని, పిన్నిగారు

వెళ్లినప్పటి నుంచి తనలో రగులుతున్న దుఃఖం కళ్ల చివరి వరకూ, కన్నీళ్ల రూపంలో వచ్చింది. ఒక్కసారిగా అతని చేయి విదల్చుకుని వంట గదిలోనికి పరుగెత్తినట్టుగా వెళ్లిపోయింది.

భార్య వింత ప్రవర్తనకి సుందరం విస్తుపోయాడు తామరాకు నుండి తొంగిచూస్తున్న మల్లెయి తనను చూచి నవ్వినట్టుగా ఫీలయ్యాడు

వంటగదిలో మండుతున్న పొయ్యిముందు కూర్చుని మంటను తదేకంగా చూస్తున్న దేవికకి యింత క్రితం ఘటన జ్ఞాపకం వచ్చింది

పిన్నిగారంటే సుందరానికి అత్త వరస అవుతుంది ఆ వూర్లోనే ప్రక్క వీధిలో వుంటున్నారు వాళ్లు

మధ్యాహ్నం దేవిక ఏదో కుట్టుకుంటున్న సమయంలో వచ్చిందామె

"ఏం జేస్తున్నావమ్మాయ్"?

"ఓ పిన్నిగారా? రండి" అంటూ అహ్వానించింది దేవిక కూర్చుంటూ, తన స్థూలకాయాన్ని గోడపై చేరవేస్తూ "అబ్బాయి ఆఫీసుకు వెళ్లాడా" అని అడిగిందామె

అవునండి. ఆయన ఇంట్లో వున్నంత వరకూ ఒకటే హడావుడి. పని తెమలనీయక చిన్న పిల్లల్లా మారాం చేస్తుంటారు చూడండి ఆయనటు ఆఫీసుకి వెళ్ళగానే యిల్లు బోసిపోయినట్టుంటుంది"

"ఆఁ క్రొత్త మోజు అలాగే వుంటుంది మీ బాబాయిగారుకూడా మా పెళ్ళయిన కొత్తలో అలాగే వుండేవారు. కాని అమ్మాయ్! నీ వెంత అమాయకురాలివమ్మా! మనుష్ని చాలా త్వరగా నమ్మేస్తావ్ మంచిదానవు కాబట్టి నీ కంటికి అందరూ మంచిగానే కనిపిస్తారు."

ఈ రకం పొగడ్తకి పొంగిపోయే మన స్తత్వం కాదు దేవికది

"మరేం పిన్నిగారూ! మన ఆలోచనల ఆరోగ్యంగా ఉంటే మన పరిసరాలు కూడ ఆరోగ్యంగా వుంటాయిట అని మా బామ్మ చెబుతుండేది, అయినా యిపుడు మీ విషయం గూర్చి చెబుతున్నారు?" అంది అమాయకంగా

"ఎంత అమాయకురాలివమ్మా! ఇంక అర్థం కాలేదా? అదే సుందరం విషయం" అంటూ నసిగింది

"వారి విషయము?!!"

"అవును తల్లీ! అయినా నీకీ విషయం ఎలా తెలుస్తుందిలే ఇది మీదాకా రానివ్వకుండా జాగ్రత్తపడ్డారే తల్లీ కొడుకులు అసలు విషయం వారికీ, వారి ఆఫీసులో పనిచేసే ఒక అమ్మాయికి సంబంధముండేది అందరూ అనుకున్నాకే నాకు తెలిసింది ఈ విషయం తెలిసే ఇక్కడి వాళ్ళెవరు వాడికి పిల్ల నివ్వలేదు మేమూ యివ్వలే దనుకో అందుకే అన్నపూర్ణ వదినె దూర ముగా వున్న నిన్ను కోడలిగా తెచ్చుకుంది వెంటనే కన్ను మూసింది .."

తన కాళ్ళ క్రింద భూమి పగిలి పోతున్న దనిపించింది దేవికకి ఆడది ఎందుకయిన సహిస్తుంది కాని తనవాడు అని అనుకున్న భర్త హృదయంలో మరొక స్త్రీకి స్థాన ముందని తెలిస్తే తట్టుకోలేదు అది ఆమె సహజ ప్రకృతి.

అయితే వారి ప్రేమంతా నటనేనా? నిర్మలమైన అతని ముఖం వెనుక యింత మలినం దాగి వుందా? నీ వంటే నా కెంతో యిష్టం దేవీ అనే తీయని పలుకుల తో తనను చుట్టిన ఆ చేతులకు, యింకో చేయితో పరిచయముందా? హే! భగవాన్, ఏది నమ్మను? పోనీ వార్నే అడిగేస్తే! నిజం

[మిగతా 39 వ పేజీలో]

# మల్లెలు నవ్వాయి

(31 వ పేజీ తరువాయి)

చెబుతారనే ఆశవుందా? లేదు. యింత నటన మాడుతున్న ఆయన నిజం చెప్పరు. యిప్పుడు నేనేం జెయ్యాలి?"

ఇలా ఆలోచనలతో రేగి పోతున్న దేవికకి "వస్తానమ్మా" అని వెళ్ళి పోతున్న పిన్నిగారి పిలుపు వినబడనే లేదు

* *

రెండు దినాలుగా భార్య మౌనం సుందరాన్ని చాలా బాధింప జేస్తోంది. పరిహాసోక్తులతో దగ్గరకు చేరినా మొహం తిప్పేస్తోంది ఆఫీసు కెళ్లేటప్పుడు గుమ్మం వరకూ వచ్చి సాగనంపడమూ లేదు యింటికొచ్చేటప్పుడు గుమ్మంలో చిరునవ్వులు చిందించడమూ లేదూ రెండు దినాలయి మాట్లాడమే లేదు. తను తెచ్చిన పువ్వులూ పెట్టుకోవడం లేదు అసలు ఆమెకి ఏమయ్యిందో అర్థం కావడం లేదు

ఆ రోజు శుక్రవారం. సాయంకాలం అయిదు గంటలయింది. ప్రతి వారం తను లేనిదే గుడికి వెళ్లని దేవిక, ఆ నాడు తనను పిలువకుండానే ప్రక్కింటమ్మాయితో కలసి వెళ్లింది. మరొక సారయితే తను సరదాకి గుడికి రానని మొండికేనా, మురిపించి మరీ తీసుకెళ్లేది ఆ సంఘటనలు జ్ఞాపకం వచ్చి చిన్నగా నవ్వుకున్నాడు.

దేవిక యింకా రాలేదు ఈ రెండు దినాలుగా ఆమె మొఖం ఎంత పీక్కుపోయిందో అతనికి తెలియందికాదు, ఈ విషయం జ్ఞాపకం రాగానే అతని హృదయంలో ఆమె పట్ల జాలితో నిండిపోయింది. అందుకే ఈ రోజు ఎందుకామె మౌనంగా తనలో తాను బాధ పడ్తూ, తనను కూడ బాధ పెడ్తుందో ఖచ్చితంగా అడిగేయాలని అసహనంతో గదిలో పచార్లు చేస్తూ, ఆమె రాకకై ఎదురు చూస్తూ పదేపదే వీధివైపు చూస్తున్నాడతను.

అంత లో తలుపు దగ్గర అలికిడయింది. భార్యేమో అనుకుని తిరిగి చూచిన సుందరానికి అత్తయ్య కనిపించేసరికి కొంచెం చిరాకనిపించింది

"ఏరా సుందరం! అమ్మాయి లేనట్లుందే" అంటూ లోని కడుగెట్టిం దావిడ

"అవునత్తయ్యా! గుడికెళ్ళింద"న్నాడు ముక్తసరిగా కనీసం కూర్చోమనైనా చెప్ప లేదు. ఆమె అంటే అతనికంత సద్భావం లేదు వచ్చని కాపురాల్లో చిచ్చులు పెట్టగల వ్యక్తి అని, ఆమె సహవాసం ప్రమాదంతో కూడుకున్నదని సుందరం విశ్వాసం.

ఎన్నోసార్లు దేవికతో ఆవిడ్ని యింటికి రానివ్వవద్దనీ, యిద్దరి మంచి వ్యక్తుల మధ్య తగవు పెట్టడమంటే తనకు వెన్నతో పెట్టిన విద్యనీ, చెప్పేవాడు, కాని దేవిక సమాధానానికి ప్రతిగా నవ్వేసేది

"అన్నట్టు అబ్బాయి! అమ్మాయి ఈ రెండు దినాలుగా అదోలా వుంటుంది కారణమేమిటో?" గుట్టులు కనుక్కోడానికి యిది మొదటి ఎత్తన్న మాట.

"అబ్బే! ఏం లేదత్తయ్యా! తనకి ఆరోగ్యం కాస్త బాగాలేదు అందుకే అలా వుంది." యిలా చెప్పవలసి వచ్చినందుకు అతనికి ఆ సమయంలో దేవికపై ఎక్కడ లేని కోపం వచ్చింది.

"అదా సంగతి! నే నింకా ఏదో అనుకున్నాన్లే. అయినా సుందరం, నాకు తెలియక అడుగుతానుగాని. ఆ పిల్లలో ఏం జూచిరా, అంత దూరాన వున్న సంబంధం చేసుకున్నావ్! న్యూరన్నా, వెయ్యన్నా. అనుకున్నా, ఎంతయినా మనం మనం ఒకటిగాని!

# ప్రగతి

## చందా రేట్లు

| | ఏజంటు ద్వారా | పోస్టు ద్వారా |
|---|---|---|
| 3 నెలలకు | 7-80 | 8-50 |
| 6 నెలలకు | 15-60 | 17-00 |
| 12 నెలలకు | 31-20 | 34-00 |


అయినా మన పిల్లల మాదిరి, పరాయి పిల్లల అమరుస్తుందా?" యింకా ఏదో చెప్ప బోతున్న ఆవిడ పట్ల అసహ్యభావం పొంగి పోయింది

"అత్తయ్యా" అని అసహనంగా అరిచాడు

"...... ఈ మాటలన్నీ, ఆ నాడే అయ్యాయి. మేము పేదవారమని ఎంత గేలి చేసే దానివో మరచి పోయావా? మా ఆఫీసులో పని చేసే అమ్మాయితో "చెల్లి" అనే మమతాను బంధం పెంచుకున్నాను. అటువంటి పవిత్రమైన బంధానికి, నీచ సంబంధం అంటకట్టి ప్రచారం చేయడం అబద్ధమా? ఫలితంగా ఏకాంతాన్ని నా కివ్వలేదు నీదా బంధువుల యిళ్ళకి వెళ్ళకూడా పిల్లల్ని యివ్వకుండా చేసావ్. ప్రతినిత్యం నీవు పూజించే దేవుడు నిజంగా వున్నట్టయితే తప్పక నిన్ను శిక్షించక మానడు. ఈనాడేదో నేను హోదాగల ఉద్యోగంలో వున్నానని నన్నేదో ఉద్ధరించినట్టు, తీపిమాటలాడు తున్నావ్. ఇప్పుడు నా భార్య కేం లోప మొచ్చింది. చెప్పాలంటే, ఆమెలాంటి సంస్కారం మనవాళ్ళలో లేదనే అంటాను. ఈ విషయం సరిగ్గా చెప్పడానికి వచ్చి యున్నట్టయితే యిక దయచేయవచ్చు" అన్నాడు కటువుగా.

అంతక్రితమే గుడినుండి తిరిగి వచ్చి, ఈ సంభాషణ ఆలకిస్తున్న దేవిక హృదయం పశ్చాత్తాపంతో నిండిపోయింది. ఎదురుగా వస్తున్న పిన్నిగార్ని తప్పుకుని, పరుగెత్తి నట్టుగా వెళ్ళి భర్త హృదయంపై వాలి పోయింది

భార్యని ప్రేమగా గుండెలకి అదుముకుంటూ, టేబిలు పైనున్న మల్లెల్ని ఆమె జడలో తురిమాడు.

రెండు దినాలుగా పడిన బాధని విరహాన్ని ఆ క్షణంలో మరిచారు.

ఆ యిరువురి ప్రేమను చూసిన మల్లెలు గుబాళించి పకక్కున నవ్వాయి.